క్లుప్తంగా

వైభవంగా సుబ్రమణ్యస్వామి కల్యాణం



శ్రీవల్లిదేవసేన, సుబ్రమణ్యస్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

గూడూరు: స్థానిక మూలస్థానేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్యస్వామివారి వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను వేదికపై కొలువుదీర్చి, వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించి, మొక్కులు తీర్చుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలి

సైదాపురం: తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వచ్చే ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఏఏబీ అధ్యక్షుడు గుంటమడుగు శ్రీనివాసులురాజు కోరారు. మండలంలోని అన్నంరాజుపల్లెలో శుక్రవారం ఉద్యాన, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది మదన్, అర్చన, శోభ, మార్తమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు మందులు పిచికారీ



తీపనూరులో మందు పిచికారి చేస్తున్న సిబ్బంది

చిల్లకూరు: వైద్యశాఖ, మండల అధికారులు, సిబ్బంది మండలంలోని పలు గ్రామాల్లో దోమల నివారణకు శుక్రవారం మందులు పిచికారీ చేశారు. ఈఓపీఆర్‌డీ మాణిక్యం పర్యవేక్షణలో తీపనూరు పంచాయతీ కార్యదర్శి మనోజ్ఞ, వైద్య సిబ్బంది, గ్రామంలోని మురుగు కాలువలో దోమల నివారణ మందును పిచికారి చేశారు.

ముమ్మరంగా విజిలెన్స్ తనిఖీలు

సైదాపురం: మండల పరిధిలోని సైదాపురం–పొదలకూరు, సైదాపురం–మర్లపూడి రహదారుల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా తిరిగే వాహనాలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ పెంచలరెడ్డి హెచ్చరించారు. అనంతరం పలు వాహనాలను తనిఖీ చేయగా ఒక వాహనంలో అదనపు లోడ్‌తో సరకు తరలిస్తుండడంతో బ్రేక్ ఇన్స్పెక్టర్‌కు అప్పగిస్తామన్నారు. వారి వెంట అటవీ శాఖ రేంజర్ గోపి కృష్ణ తదితరులున్నారు.

నెలబల్లిలో ఘనంగా గంధోత్సవం



దర్గాలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామంలోని హుస్సేనమ్మ దర్గాలో గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు బెల్లం, ఖజ్జూరం తదితరాలు దర్గాలో నైవేద్యంగా పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం రాత్రి భక్తుల కోసం దర్గా కమిటీ వారు సాంస్కృతిక కార్యక్రమాలు, పాటకచ్చేరి ఏర్పాటు చేశారు. అవాంఛనీ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ తిరుమలరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిల్లకూరు: మండల కేంద్రంలోని మిక్సెడ్‌కాలనీకి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మిక్సెడ్ కాలనీకి చెందిన ఉదయ్‌కుమార్(34) కొంత కాలంగా మద్యానికి బానిసై తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో అతను గత నాలుగు రోజుల క్రితం మనస్తాపంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగి, ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని నెల్లూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడిపందెం స్థావరాలపై దాడులు

కోట: కొక్కుపాడు సమీపంలో శుక్రవారం కోడి పందెం స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. ఇద్దరు పందెం రాయుళ్లను అరెస్టు చేసి, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పుల్లారావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారూరు.. ప్రగతి మల్లె

ఆ పంచాయతీ ఆదర్శ కార్యాచరణతో ప్రత్యేకతను చాటుతోంది. గ్రామీణ భారతంపై బలమైన ముద్ర చూపి.. అభివృద్ధి పరిమళాలు వెదజల్లుతోంది. పలు పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తోంది. కారూరు పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక కథనం.



గ్రామంలో ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైప్‌లైన్



ఖాశింగాడుకుప్పం, బాలకృష్ణాపురం కుప్పాలకు వేసిన సీసీ రోడ్లు

తడ: తమిళనాడు సరిహద్దుకు కూతవేటు దూరంలోని కారూరు పంచాయతీ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోంది. పంచాయతీలో కారూరు, ఎస్సీ కాలనీ, కారూరు మిట్ట, ఖాశింగాడు కుప్పం, బాలకృష్ణాపురం కుప్పం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం 1,256 ఇళ్లు, ఐదు వేల జనాభా ఉన్నారు. గతంలో ఈ పంచాయతీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. రెండేళ్ల కిందట జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో కారూరు సర్పంచ్‌గా విద్యావంతురాలైన నిత్య విజయం సాధించారు. ఆమె విజయంతో ఆ పంచాయతీ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, సర్పంచ్ భర్త ఆర్కే సుందర్‌రెడ్డి సహకారంతో పంచాయతీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. ఆ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నారు.

అభివృద్ధి పనులివీ..

- జాతీయ రహదారి నుంచి గ్రామంలోని ఎస్సీ కాలనీ వరకు రూ.16 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం.
- ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) గ్రాంటు రూ.2.32 కోట్ల నిధుల్లో రూ.1.38 కోట్లతో జాలర్ల కుప్పాల్లో సీసీ రోడ్లు, మిగిలిన మొత్తంతో కారూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ నుంచి గ్రామం చివరన ఉన్న పెదపాళెం అమ్మవారి గుడి వరకు సీసీ రోడ్డు, అంతర్గత రోడ్ల పనులు వేగవంతంగా సాగుతున్నాయి.
- కారూరు, ఎస్సీ కాలనీ, బాలకృష్ణాపురం కుప్పంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం.
- పంచాయతీలోని గ్రామాల్లో తాగునీటి వసతి కల్పనకు జలజీవన్ మిషన్ నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకు, పైప్‌లైన్ల పనులు సాగుతున్నాయి.
- ఉప్పు నీటితో సతమతమవుతున్న జాలర్ల కుప్పాలకు కారూరు నుంచి మంచి నీటిని సరఫరా.
- లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి పంచాయతీ మొత్తానికి 3 ఫేజ్ విద్యుత్ లైన్ల ఏర్పాటు.
- దాతల సహకారంతో పంచాయతీలోని పాఠశాలలు సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను స్థానిక సెయింట్ గోబైన్ పరిశ్రమ సహకారంతో రూ.6.5 లక్షల వెచ్చించి అభివృద్ధి పనులు.
- గ్రామంలో రూ.10 లక్షల విలువ చేసే 250 సోలార్ లైట్ల ఏర్పాటు.

అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి



ప్రజలు మాపై ఎంతో ప్రేమతో, నమ్మకంతో ఓట్లు వేసి తిరుగులేని మెజారిటీతో గెలిపించారు. వారి నమ్మకానికి తగ్గట్టు నేను, నా భర్త సుందర్‌రెడ్డి పంచాయతీ అభివృద్ధికి చిత్త శుద్ధితో కృషి చేస్తున్నాం. రోడ్లు, తాగునీరు, విద్యుత్ తదితర అత్యవసర సేవలు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించి పని చేస్తున్నాం. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయకులు, ఉన్నత అధికారులు, గ్రామస్తులు పూర్తిగా సహకరించి మాకు ధైర్యం ఇస్తున్నందుకు ధన్యవాదాలు.

– నిత్య, సర్పంచ్, కారూరు

ప్రతి హామీ నెరవేర్చిన ఘనత జగనన్నదే



దొరవారిసత్రం: కల్లూరులో లబ్ధిదారుకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం: బడుగు బలహీన వర్గాల ప్రజలకు, రైతులు, పొదుపు మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నదే అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శుక్రవారం మోనేరి, కుమ్మరగుంట, కుక్కలపల్లివారి కండ్రిగ, కల్లూరు, కల్లూరుకండ్రిగ గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి, బుక్‌లెట్‌లను అందజేశారు. సమస్యలను ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అక్కడిక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడారు. కల్లూరులో పలువురు రైతులు తెలుగు గంగ కాలువ పనులు పూర్తి చేస్తే మెట్ట రైతులకు సాగునీరు పుష్కలంగా అందుతాయని ఎమ్మెల్యేకు తెలిపారు. అలాగే వీధుల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, సీసీ రోడ్లు నిర్మాణం వంటి పనులు చేపట్టాలని స్థానికులు కోరారు. ఈ సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే మండల అధికారుల స్థాయిలో ఉన్న ప్రతి సమస్య పరిష్కారించేలా చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం నెరవేర్చడంతోపాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ఎల్లో మీడియం ద్వారా బురదచల్లే కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో చెంగాళ్లమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మండల కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, నాయకులు పురుషోత్తం, రమేష్, యుగంధర్, చెంగయ్య, బాబురెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఓడూరు రమణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ...

ఓజిలి: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన పుచ్చలపల్లి శ్రీనివాసులురెడ్డిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శుక్రవారం పరామర్శించారు. శ్రీనివాసులురెడ్డి భార్య గీతమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్ మౌనిక, పిండుకూరు మధుసూదన్‌రెడ్డి, పాదర్తి హరనాథ్‌రెడ్డి, ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ముమ్మడి సుబ్బారావు యాదవ్, పుల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మిస్తాం



దక్కిలి:ఆగిన ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

దక్కిలి: ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను నిర్మిస్తామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆల్తూరుపాడు గ్రామం వద్ద అర్ధాంతరంగా ఆగిపోయిన రిజర్వాయర్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అల్తూరుపాడు పీఏసీ ఎస్ కార్యాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 80 వేలు ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్ట్ నిర్మాణం విషయాన్ని ఇటీవల సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయానని చెప్పారు. సీఎం సానుకూలంగా స్పందించి ప్రాజెక్టు పూర్తి చేయిస్తామని మాట ఇచ్చారని తెలిపారు. రిజర్వాయర్ పనులు ఆగిపోయేందుకు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిలే కారణమని విమర్శించారు. ఎంపీపీ గోను రాజశేఖర్, చింతల శ్రీనివాసులురెడ్డి, పాదిలేటి దశరథరామిరెడ్డి, వెలికంటి రమణారెడ్డి, మాదిరెడ్డి మునిరామ్‌రెడ్డి, నర్రావుల ప్రకాశంనాయుడు, పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, బండి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవకుడిలా పనిచేస్తా

వెంకటగిరి: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవకుడిలా పనిచేస్తానని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలో పలు సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ ప్రచారవిభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, ఆర్టీసీ మాజీ రీజినల్ చైర్మన్ చెలికం శంకరరెడ్డి, జిల్లా సెంట్రల్‌బ్యాంక్ చైర్మన్ వెలికంటి రమణారెడ్డి, నేతలు కె బ్రహ్మయ్య, జిల్లా సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, బండి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెంచలకోనలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నేదురుమల్లి

ప్రతి భక్తుడికీ మంచి దర్శనం

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే ప్రతి భక్తునికి మంచి దర్శనం జరగాలని వైఎస్సార్ సీపీ తిరుపతి అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పెంచలకోనలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నెల్లూరు ఆర్డీఓ మలోలా, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారని, వారందరికీ మంచి దర్శనం కల్పించాలన్నారు. టీటీడీ నిర్మించిన అతిథి గృహాలను బ్రహ్మోత్సవాలకు వినియోగించుకునేందుకు చైర్మన్ సుబ్బారెడ్డి అనుమతించారన్నారు. అంతకుముందు మూడు ఆలయాల పరిసరాలు, కోనేరు, కల్యాణకట్ట పరిశీలించారు. తరువాత వారు పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్ రెడ్డి, మధురెడ్డి, రవీంద్రారెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

బకాయిలు త్వరలో చెల్లిస్తాం



మినీ గురుకులం షెడ్‌ను పరిశీలిస్తున్న ఏపీఓ

చిల్లకూరు: త్వరలో రైతులు నిర్మించుకున్న మినీ గోకులం షెడ్లకు సంబంధించిన బకాయిలను చెల్లిస్తామని ఉపాధి హామీ ఏపీఓ గిరి తెలిపారు. మండలంలో గతంలో నిర్మించిన మినీ గోకులం షెడ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం మినీ గోకులం షెడ్లు మంజూరు అయ్యాయని, అయితే అప్పటో వాటికి నిధులు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇటీవల పశుసంవర్థక శాఖ నుంచి వాటిని ఉపాధి పథకానికి బదిలీ చేయడంతో ఆ నిధులను ప్రస్తుతం ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కోట మండలం ఊనుగుంటపాళెంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులకు పరిశుభ్రత, పచ్చదనంపై అవగాహన కల్పించారు. రోడ్లకిరువైపుల మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం కోఆర్డినేటర్ ఉదయకుమార్, రవీంద్రరెడ్డి, హెచ్‌ఎం శేషయ్య పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కలికి మాధవరెడ్డి

నాయుడుపేటటౌన్: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ప్రజలంత జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి, మరో సారి సీఎంను చేయాలని ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి కోరారు. శుక్రవారం జువ్వలపాళెం సచివాలయం పరిధిలో శ్రీరామ్ నగర్ తదితర ప్రాంతాల్లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కౌన్సిలర్ దువ్వూరు లక్ష్మీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

డీఆర్‌డబ్ల్యూ కరస్పాండెంట్‌గా డాక్టర్ మెహర్మణి



డాక్టర్ మెహర్మణికి నియామక పత్రాన్ని అందజేస్తున్న విద్యాసాగర్

గూడూరు: పట్టణంలోని దువ్వూరు రమణమ్మ ఎయిడెడ్ మహిళా కళాశాల(డీఆర్‌డబ్ల్యూ) కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్‌గా డాక్టర్ మెహర్మణి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెకు కళాశాల కోశాధికారి వై విద్యాసాగర్ ఎన్నిక పత్రాన్ని అందజేశారు. డీఆర్‌డబ్ల్యూ కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్‌గా ఉన్న డాక్టర్ సీఆర్‌రెడ్డి ఈ నెల 24వ తేదీన మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో డాక్టర్ మెహర్మణిని కార్యదర్శి, కరస్పాండెండ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కళాశాల కోశాధికారి వై విద్యాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ డైరెక్టర్లు డాక్టర్ జనార్దన్‌రెడ్డి, జానకిరాంరెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిల్లకూరు: మండలంలోని జాతీయ రహదారిపై మోటరు సైకిల్ కల్వర్టును ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కోట మండలం, ప్రకాశం కాలనీకి చెందిన ప్రసన్న అనే వ్యక్తి బైక్‌పై గూడూరుకు వచ్చి తిరిగి ఇంటి వెళుతున్నాడు. ఈ క్రమంలో మండలంలోని రైటార్ సత్రం సమీపంలోని జాతీయ రహదారి వద్దకు వచ్చే సరికి బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసన్న తీవ్రంగా గాయపడ్డాడు. హైవే మొబైల్ సిబ్బంది గుర్తించి క్షతగాత్రుడ్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

5న మండల మీట్

గూడూరురూరల్: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మే 5వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బూదూరు గురవయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అన్ని శాఖలపై సమీక్ష జరుగుతుందన్నారు.

రీ సర్వేతో భూవివాదాలు పరిష్కారం



మాట్లాడుతున్న కౌన్సిలర్

వెంకటగిరి: దేశచరిత్రలో ఎక్కడాలేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూర్వేతో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందని కౌన్సిలర్ ఏ శంకరయ్య తెలిపారు. స్థానిక 14వ వార్డు సచివాలయ పరిధిలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ రాణి, సర్వేయర్ వాసు, వీఆర్వో వాణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే ఇంటింటా వెలుగులు



బుక్‌లెట్ అందజేస్తున్న యామిని

గూడూరురూరల్: జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమ వెలుగులు నిండాయని గూడూరు జెడ్పీటీసీ సభ్యురాలు ఊటుకూరు యామిని అన్నారు. మండలంలోని కాండ్ర గ్రామంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్, గృహసారథులతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లారు. ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గృహ యజమానుల అనుమతితో స్టిక్కర్లను అంటించారు. జెడ్పీటీసీ దంపతులను వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మహేంద్రరెడ్డి, ముప్పాళ్ల పెంచలరాజు, నన్నూరు రాజశేఖర్, కొండూరు రవిరాజు, ఉగ్గుమూడి సురేష్‌రెడ్డి, ఎంట్రపాటి సూర్యచంద్ర, కోటి,చరణ్, సుధా తదితరులు పాల్గొన్నారు.

పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

వాకాడు: పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది జగనన్న ప్రభుత్వమేనని, ప్రజలంతా బాగుండాలన్న సదుద్దేశంతో పారదర్శక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన భూ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలు పెరిగిపోతున్నా ఏ నాయకుడు పట్టించుకోలేదన్నారు. ఈ తరుణంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రతి భూ సమస్యకు చక్కని పరిష్కార మార్గం చూపారన్నారు. రైతులు ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమిలో ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే అలాంటి రైతులకు భూ పంపిణీలో ప్రభుత్వం భూ హక్కు పట్టా మంజూరు చేస్తుందన్నారు. అలాగే చుక్కల భూముల్లో సాగు చేస్తున్న రైతులకు కూడా శాశ్వత పరిష్కారం చూపారన్నారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అటవీ ఆంక్షలతో అభివృద్ధికి నోచుకోని తీర ప్రాంత గ్రామాలకు సైతం పరిష్కార మార్గం లభించిందన్నారు. అనంతరం భూ సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ వాకాటి నాగభూషణమ్మ, నాయకులు అజిత్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరత్నం, కిరణ్‌రెడ్డి, కృష్ణయ్య, జనార్దన్‌రెడ్డి, తదితరలు పాల్గొన్నారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న తహసీల్దార్ నరసింహారావు

వాకాడు: మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని ఎంపీపీ కొడవలూరు అనుసూయమ్మ అన్నారు. మండల కేంద్రమైన వాకాడు వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో శుక్రవారం మండల సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పంచాయతీల నుంచి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని, మండల అభివృద్ధిపై చర్చించారు. తహసీల్దార్ నరసింహారావు మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు లేకుండా తన వంతు కృషి చేస్తామన్నారు. మండలంలో అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీనాథ్, జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ వాకాటి నాగభూషణమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

జీవామృతంతో భూసారం వృద్ధి



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

చిల్లకూరు: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతులు జీవామృతం వాడితే భూసారం పెరగడంతో పాటు అధిక దిగుబడి వస్తుందని ప్రకృతి వ్యవసాయ మోడల్ ట్రైనీ తిరుమల తెలిపారు. మండలంలోని కడివేడు గ్రామంలో రైతు సంఘాల సభ్యులకు శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మోడల్ ట్రైనీ తిరుమల మాట్లాడుతూ జీవామృతం తయారీకి ఒక డ్రమ్ములో ఆవు మూత్రం తీసుకుని అందులో బెల్లం, పుట్టమట్టి, శనగపిండి, ఆవు పేడ, కలుపుకుని వారం రోజుల పాటుగా నిల్వ ఉంచిన తరువాత దానిని మొక్కలకు, పంటలకు వాడుకుంటే మొదళ్ల వద్ద భూమి గుల్లబారి సారవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ శ్రీనివాసులు, సుహర్లత, అశోక్, లక్ష్మి, శీనయ్య పాల్గొన్నారు.

ఎంఈఓలకు సన్మానం



ఎంఈఓలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఎంఈఓలు టీ వెంకటేశ్వర్లు, పీ లక్ష్మన్న, నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ కె బాలాజీకి బాలాయపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విధి నిర్వహణలో బదిలీలు సర్వసాధారణమని, బాలాయపల్లి మండలంలో విద్యాభివృద్ధికి ఎంఈఓలు చేసిన కృషి అభినందనీయమన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏడీఏ నాగార్జునసాగర్

వెంకటగిరిరూరల్: రైతులకు భూసార పరీక్షలపై అవగాహన అవసరమని, వాటి ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ నాగార్జున సాగర్ పేర్కొన్నారు. స్థానిక కృషివిజ్ఞాన కేంద్రంలో శుక్రవారం వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులతో భూసార పరీక్ష ఫలితాల విశ్లేషణలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంటలు సాగు చేసే ప్రతి రైతుకూ భూసార పరీక్షలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డీఆర్సీ భాస్కరయ్య రచించిన భూసార పరీక్షలు– ఎరువుల యాజమాన్యం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు, డీఆర్సీ వేణుగోపాల్, రాజీవన, డీఆర్‌సీ ఏఓ శ్రీనివాసులు, ఎంఏఓలు సుజాత, శిరీష, విజయభారతి, టీఏ, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.